రిటర్నింగ్ అధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిటర్నింగ్ అధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థిగా సల్మాన్‌ఖాన్ నామినేషన్ వేశారు. అక్టోబరు 22న నామినేషన్ల పరిశీలన జరుగుతుండగా షేక్‌పేట మండల కార్యాలయం వద్దకు వచ్చిన సల్మాన్‌ఖాన్ తన నామినేషన్ తిరస్కరించడంపై నిరసన వ్యక్తం చేశాడు. తన మనుషులతో కలిసి రిటర్నింగ్ అధికారిని దుర్భాషలాడాడు. ఆర్‌ఓ సాయిరాం ఫిర్యాదు మేరకు సల్మాన్‌ఖాన్ పై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్‌ఎస్ 132, 196, 352 సెక్షన్లు, ప్రతినిధుల చట్టం 1951 ప్రకారం 125 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోహిణ్‌రెడ్డి, సుమంత్‌పై కేసు నమోదు చేయాలి


జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ కుమార్తె ఆరోపణలను పరిగణలోకి తీసుకొని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి, మంత్రి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న మంత్రి కుమార్తె కొండా సుష్మిత మీడియాతో మాట్లాడుతూ డెక్కన్ సిమెంట్స్ విషయంలో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి, మాజీ ఓఎస్‌డీ సుమంత్ బెదిరించినట్టు చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి కుమార్తె వ్యాఖ్యల నేపథ్యంలో నేరం జరిగినట్టు తెలుస్తోందని, వారిద్దరిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.



అభ్యర్థి ప్రచారంలో కళాకారులు

పాటలే ప్రచార అస్త్రాలు

ఉప ఎన్నికలో అభ్యర్థులపై ప్రత్యేక పాటలు
పలుచోట్ల కళారూపాల ప్రదర్శన

యూసుఫ్‌గూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాట చాలా శక్తివంతమైనది. ప్రభుత్వాన్ని పడగొట్టాలన్నా, ప్రతిపక్షాన్ని ప్రజలకు దగ్గర చేయాలన్నా పాటలే కీలకం. కాగా, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణానంతరం ఉప ఎన్నిక వచ్చింది నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల ప్రక్రియ రోజు నుంచే ప్రధాన రాజకీయ పార్టీలన్నీ కళాకారులను ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. అందులో భాగంగానే కాంగ్రెస్ ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి ప్రచార కళాకారులను బస్తీల్లో తిప్పుతూ ప్రచారం ముమ్మరం చేసింది.

పగలు ప్రచారం.. రాత్రి సభలు

తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రముఖ కళా బృందాలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి తరలివచ్చారు పగలు అభ్యర్థితోపాటు ప్రచారంలో పాల్గొని రాత్రి బస్తీల్లో నిర్వహించే సభలలో ఆడిపాడుతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులకు ఓటు వేసేలా చైతన్యం చేస్తున్నారు. అభ్యర్థులపై ప్రత్యేకంగా పాటలు పాడుతున్నారు.


చిన్నారెడ్డి, దివ్యను కలిసిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

సీఎం ప్రజావాణి చొరవతో
1,087 మందికి 'డబుల్' ఇళ్లు

బేగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి చొరవతో 1,087 మందికి డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారులు శుక్రవారం సీఎం ప్రజావాణికి వచ్చి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ప్రజావాణికి 220 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 64, రెవెన్యూకు 54, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46, హోంశాఖకు 14, ప్రవాసి ప్రజావాణికి 2, ఇతర శాఖలకు 49 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి అధికారి పేర్కొన్నారు.


అవార్డును అందుకుంటున్న షేక్ ఖలీఫాతుల్లా బాషా

ఖలీఫాతుల్లా బాషాకు యూఎన్‌ఎస్‌డీజీ అవార్డు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ నేషన్స్ డే సందర్భంగా యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అవార్డును ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషాకు ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ కల్చర్ అండ్ డిప్లొమాటిక్ రిలేషన్స్ ఆర్గనైజేషన్ అందజేసింది. నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సెమినార్‌లో దేశభక్తి, సమాజసేవ, లీడర్ షిప్ స్వభావం కలిగి, మానవ హక్కుల కోసం కృషి చేస్తున్నందుకు శుక్రవారం నిర్వాహకులు ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

రాష్ట్ర మంత్రి సీతక్క

బోరబండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర మంత్రి డా.సీతక్క కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్, కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బోరబండ సైట్-3 కాలనీలో శుక్రవారం ఆమె ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నిత్యం అందుబాటులో ఉండే నవీన్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే జూబ్లీహిల్స్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తదని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న వారు ప్రజలను, నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండ్రు శోభారాణి, మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం కార్పొరేటర్ ఎం.డి.ముస్తఫా, డా.పి.వి.రవిశేఖర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.అశోక్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, కవిత, రవినాయుడు, ఎజాస్ బేగ్ పాల్గొన్నారు.


బోరబండ డివిజన్ సైట్-3 కాలనీలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క

షేక్‌పేట్‌లో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తెలిపారు. షేక్‌పేట్ డివిజన్‌లోని మసీదు వద్ద శుక్రవారం ప్రార్థనల అనంతరం బయటకు వచ్చిన మైనార్టీలను ఆయన ఆత్మీయంగా పలకరించారు.


షేక్‌పేట్ డివిజన్ పెద్ద మసీదు వద్ద మైనార్టీలను కలిసిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడలో..

యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరి, కృష్ణానగర్ ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీలను రౌడీలు అనడం కేసీఆర్‌కు అలవాటే


ప్రచారం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలను రౌడీలు అనడం మాజీ సీఎం కేసీఆర్‌కు అలవాటేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. రహ్మత్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరఫున ఆయన శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్ యాదవ్ కుటుంబాన్ని రౌడీ కుటుంబం అని కేసీఆర్ అగ్రకుల దురహంకారంతో మాట్లాడడం తగదని పేర్కొన్నారు. ఉప ఎన్నిక సమయంలో రౌడీషీటర్లను, పోక్సో కేసులు ఉన్న వారిని బీఆర్‌ఎస్ పార్టీలో ఎందుకు చేర్చుకున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కెనడీ, జాన్, జోసెఫ్, పీటర్, చందు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి యువజన విభాగం
జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవ్యతేజచౌదరి


నవ్యతేజ చౌదరి

ఖైరతాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యువజన విభాగం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖైరతాబాద్‌కు చెందిన సూరపనేని నవ్యతేజ చౌదరి నియమితులయ్యాడు. ఈ మేరకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాబితాను విడుదల చేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన పార్టీ అధ్యక్షురాలికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే, ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కరంజీ ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు.

రాంకీ సంస్థకు జరిమానా

ఖైరతాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ చెత్త తరలింపుపై చేసుకున్న ఒప్పందాన్ని రాంకీ సంస్థ తరచూ ఉల్లంఘిస్తోంది. ఈ విషయమై సర్కిల్-18 ఉప కమిషనర్ సమ్మయ్య నిక్కచ్చిగా వ్యవహరిస్తూ గడచిన నెల రోజుల్లోనే సంస్థకు రూ.3.5 లక్షల జరిమానా విధించారు. శుక్రవారం ఒక్క రోజే రెండు ప్రాంతాల్లో చెత్తను తరలించనందుకు రూ.20 వేలు ఒకచోట, మరోచోట రూ.లక్ష జరిమానా విధించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేసి జరిమానా విధించామని సమ్మయ్య తెలిపారు. పనితీరు మార్చుకోకపోతే జరిమానాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రౌడీలకు, మహిళలకు మధ్య పోరాటం

ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ఎర్రగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రౌడీలకు, మహిళలకు మధ్య జరుగుతున్న పోరాటమని, ఇందులో మహిళనే గెలవాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన బోరబండ బలహీన వర్గాల కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, రౌడీలు కలిసి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు లిక్కర్ సీసాల మూతమీద అతికించే స్టిక్కర్లను కూడా వదలకుండా కుంభకోణానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రౌడీ రాజ్యం రావద్దంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే, హైడ్రా మన ఇళ్లను కూల్చవద్దంటే కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, నాయకులు ఎస్ విజయకుమార్, వసంతరావు, జేఎల్ మేరి, ధర్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీ చేరికలు

బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ యూత్ కరేజ్(హెచ్‌వైసీ) వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ ఆధ్వర్యంలో షేక్‌పేట డివిజన్‌కు చెందిన ముస్లింలు, మహిళలు అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పతనం మొదలైంది అనడానికి బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలే నిదర్శమని పేర్కొన్నారు.


హెచ్‌వైసీ వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న మైనార్టీలు

ఆదర్శంగా తీర్చిదిద్దిన మాగంటి గోపీనాథ్

మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని దివంగత నేత మాగంటి గోపీనాథ్ ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని, ఆయన చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి తనను గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ ఛత్రపతి శివాజీనగర్, ఆనంద్‌నగర్ కాలనీ, సుల్తాన్‌నగర్ తదితర బస్తీల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, బీఆర్‌ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, నాయకులు మహ్మద్ షరీఫ్ ఖురేషి, చంద్రశేఖర్, షేక్ జావెద్, సయ్యద్ రసూల్, జయంత్ పాల్గొన్నారు.


బోరబండలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్


భారత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా


ఎన్‌వీ భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కార్మికుల పోరాటయోధుడు ఎన్‌వీ భాస్కరరావు

పంజాగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నిస్వార్థ నాయకుడు ఎన్‌వీ భాస్కరరావు అని సీపీఎం నాయకుడు సీహెచ్ చంద్రశేఖర్‌రావు అన్నారు. నగరంలో మొదటి తరం కార్మిక నాయకుడు ఎన్‌వీ భాస్కరరావు 41వ వర్ధంతి కార్యక్రమం సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధురానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సోషలిజం స్థాపన కోసం ఎన్‌వీ భాస్కరరావు సీపీఎంలో పనిచేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి అశోక్, జితిన్, విజయవాణి, దండు సత్యనారాయణ, యాదగిరి, రమణ, ప్రసాద్, రమేష్, రాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఓటర్లకు సౌకర్యాలు, సహాయ కేంద్రాలు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ప్రాథమిక సౌకర్యాలు, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే సమయంలో సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి ఓటు వేసిన తర్వాత తిరిగి తీసుకునేలా.. మొదటిసారి పీఎస్ బయట మొబైల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులతో సహా ఓటర్లందరి సౌకర్యార్థం దృష్ట్యా.. పోలింగ్‌కు ఒక రోజు ముందే అన్ని పోలింగ్‌బూత్‌లను సిద్ధం చేస్తామని, తద్వారా ఆలస్యం లేకుండా ఓటు వేసేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో తాగునీరు, టాయిలెట్లు, వేచి ఉండే స్థలాలు, లైటింగ్, ర్యాంపులు, సైన్‌బోర్డులు ఉంటాయని, ఓటు రహస్యాన్ని కాపాడేందుకు ప్రామాణిక ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌ల పరిశీలనకు బూత్‌లెవల్ అధికారుల ద్వారా ప్రతి పోలింగ్ స్థలంలో ఓటరు సహాయ కేంద్రాలు ఉంటాయని సీఈఓ వెల్లడించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మద్యం అమ్మకాలపై నిఘా పెట్టారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బిక్షారెడ్డి, ఎస్సైలు బాలరాజు, సంధ్య సిబ్బంది కలిసి శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాబా శాలిన్‌నగర్‌లో మద్యం విక్రయిస్తున్న భవాని, రమణి లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 33 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

గంజాయి విక్రేత అరెస్ట్..

బాలానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. బాలానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హకీం (24) గంజాయి విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు నిఘా పెట్టారు. బాలానగర్‌లోని ఓ పరిశ్రమ వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన హకీంను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.


బీజేపీ ప్రచార రథాలను అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, హరీష్‌బాబు, రామారావు పటేల్


ఎర్రగడ్డలో ఇస్త్రీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి

జూబ్లీహిల్స్‌లో మార్పునకు ప్రజలు సిద్ధం

- ప్రచార రథాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు

ఎర్రగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మార్పు బీజేపీతోనే సాధ్యపడుతుందని ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ ఆలయంలో ప్రచార రథాలకు పూజలు చేశారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డితో కలిసి రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ గెలుపునకు తోడ్పడతాయని పేర్కొన్నారు.

ఎర్రగడ్డలో పాదయాత్ర

బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో విస్తృతంగా పాదయాత్ర చేశారు. కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ నుంచి ప్రారంభమైన యాత్ర హేమవతి నగర్, శాస్త్రీనగర్ తదితర బస్తీల్లో కొనసాగింది. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగడ్డలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నాయకులు కుంబాల గంగరాజు, ప్రేమ్ కుమార్, గూడూరి శ్రీధర్‌రెడ్డి, బొట్టు విజయకుమార్, గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ డీకే రోడ్డు, లోథా-1 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ శ్రీనివాసనగర్ ఈస్ట్, ఆదిత్య ఎన్‌క్లేవ్, లోథా-2 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఒడిస్సీ కళాకారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో కుమారి పూజిత బృందం ఆధ్వర్యంలో శుక్రవారం భరతనాట్యం ప్రదర్శించారు. వర్ష పాండా బృందం ఒడిస్సీ సుష్మిత బృందం నిర్వహించిన దాండియా ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్ ఉత్సవ్-2025 సందడిగా సాగుతోంది.


కార్తీకమాసం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో శుక్రవారం స్వామివారికి పూలతో అలంకరణ చేసిన ఆలయ పూజారులు
● బేగంపేట, ఆంధ్రజ్యోతి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఉప్పరబస్తీలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పర బస్తీలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయటంతో సమస్యను త్వరిగతిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో నూతన పైపులైన్లు వేసేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం బస్తీలో నెలకొన్న సమస్యలపై మహిళలతో చర్చించారు. సమస్యలను దశలువారిగా పరిష్కారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవ్య, నాయకురాలు గగనకుమారి తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ బృందం

ఉద్యమకారుల సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లండి

- కోదండరాంను కలిసిన జేఏసీ బృందం

అడ్డగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పనిచేసిన తెలంగాణ ఉద్యమకారుల సమస్యల్నీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ఉద్యమ నాయకులతో పాటు బలిదానం చేసుకున్న కుటుంబాలకు న్యాయం చేయడానికి సీఎం దృష్టికి తమ సమస్యల్నీ తీసుకెళ్లాలని కోరుతూ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి విన్నవించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లు, సమస్యలపై సీఎంను కలిసే పనిలోనే ఉన్నానని కోదండరాం తెలిపారన్నారు. అలాగే ఉద్యమకారులకు 250 గజాల ప్రభుత్వ స్థలం కోసం, ముఖ్యంగా సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని కోరామన్నారు. కోదండరాంను కలిసిన వారిలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ బృందం మోత్కూరు మల్లేష్, గండమల యాదగిరి, జయకృష్ణ, వెంకట్ లక్ష్మి, అరుణ, స్వరూప, కమల, కృష్ణ మోహన్‌లు ఉన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న ప్రముఖ వైద్యులు జి.సౌమ్యా, వైద్య సిబ్బంది

ఆరోగ్య సమస్యలపై అవగాహన

మారేడుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆయూష్ విభాగం హోమియోపతి, డీకే ప్రభుత్వ హోమియోపతి హాస్పిటల్ నేషనల్ ఆయూష్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మారేడుపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఆవరణలో వయో వృద్ధుల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యబృందం వయో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతకుముందు ఆరోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హోమియో వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. హోమియో హాస్పిటల్ (రామంతపూర్) సూపరింటెండెంట్ ప్రముఖ వైద్యులు జి.సౌమ్యా, డాక్టర్లు కళావతి, అలివేలు, జ్యోతి, అఖిల, మేఘన, లహరిక, అధికారులు శ్రావణ్ కుమార్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బౌద్ధనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలు నరికివేత, వివిధ మరమ్మతులు కారణంగా జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం గంట పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యానగర్ ఏఈ రోచిత తెలిపారు. జామై ఉస్మానియా, ఎస్‌బీహెచ్ కాలనీ, బౌద్ధనగర్ బాలాజీ స్కూల్ ఏరియా, అంబర్‌నగర్, లలితానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

మానసిక ప్రశాంతతకు మొక్కలు

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆమె ఒక పోలీస్ అధికారి. కాని మొక్కలు అంటే చాలా ఇష్టం. చిన్నతనం నుంచి మొక్కలు పెంచడం హాబీగా మలుచుకుంది. 2024 సంవత్సరంలో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరింది. అయినప్పటికి తన మొక్కల పెంపకంను కొనసాగిస్తుంది.ప్రస్తుతం మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహేశ్వరి టేబుల్ మీద ఉన్న వివిధరకాల బోన్సాయ్ మొక్కలు ఆకర్షిస్తాయి. వాతావరణ సమతుల్యతలో వృక్షాలు ప్రధాన భూమిక పోషిస్తాయని, అదే విధంగా మానసిక ప్రశాంతతకు మొక్కలు ఉపయోగపడుతాయని నమ్ముతానని ఆమె తెలిపారు.


ఎస్సై మహేశ్వరి టేబుల్ మీద ఉన్న మొక్కలు

లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో అన్నకోటి

రాంగోపాల్‌పేట్, అక్టోబర్ 24 : (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం అన్నకోటి (అన్నకూట్) నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొనాలని వారు కోరారు. ప్రతి సంవత్సరం దీపావళి తర్వాత కార్తీకమాసం శుద్ధ పంచమి నాడు అన్నకోటి(అన్నకూట్) నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.


లక్ష్మీనారాయణస్వామి

యువతి అదృశ్యం

బౌద్ధనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాలగుండు ఉప్పరబస్తీకి చెందిన ఎం.ఆర్తి(20) 23వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో షాపుకు వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆ యువతి వద్ద ఫోన్ లేదు. దీంతో కుటుంబసభ్యులు ఆ యువతి కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. యువతి తండ్రి భూషనందం తన కుమార్తె కనిపించటం లేదని గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఆర్తి (ఫైల్)

కంటోన్మెంట్ సీఈఓకు సమస్యల స్వాగతం

- మౌలిక సమస్యలు
- రావలసిన బకాయిలు
- పెండింగ్‌లో సర్వీస్ చార్జీలు


కంటోన్మెంట్ కొత్త సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేదీ


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

సికింద్రాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అర్వింద్ కుమార్ ద్వివేదీకి పలు క్లిష్ట సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గడిచిన కొద్ది నెలలుగా మౌలిక సమస్యలు పరిష్కరిస్తూనే, బీజేపీ-కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల రాజకీయ పోటీ కారణంగా తలెత్తుతున్న ఒత్తిళ్లను ఎలా అధిగమిస్తారోనని సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్థానిక మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు(ఈటల రాజేందర్) బీజేపీకి చెందిన నేత, స్థానిక కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభ్యుడు (శ్రీగణేశ్) కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు, నామినేటెడ్ సభ్యురాలు బీజేపీకి చెందిన నాయకురాలు కావడం, గత కొద్ది నెలలుగా శంకుస్థాపనలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, సభలు, సమావేశాల సందర్భంగా తరచూ ప్రొటోకాల్ సమస్యలు సైతం ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో నూతన సీఈఓ వ్యవహార శైలిపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు అధికార వర్గాల్లో ఆసక్తి నెలకొన్నది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రోడ్లకు మరమ్మతులు చేపడతామని ఇంజనీరింగ్ అధికారులు పలుమార్లు చెప్పినా, ఇప్పటికీ రోడ్ల దుస్థితి మారలేదు. ఈ అధ్వాన రోడ్ల సమస్యకు నూతన సీఈఓ పరిష్కారం చూపుతారేమోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెండింగ్‌లో సర్వీస్ చార్జీలు

కేంద్ర రక్షణశాఖ నుంచి కూడా వెయ్యి కోట్లకు పైగా సర్వీసు చార్జీలు రావలసి ఉంది. దాంతో కేంద్ర రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వంపై స్థానికంగా రాజకీయ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తరచూ మండిపడుతున్నారు. ఈ విషయమై కేంద్ర రక్షణశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి, బకాయిల విడుదలకు సీఈఓ ఎటువంటి యత్నాలు చేస్తారోనన్న ఆసక్తి నెలకొన్నది. అలాగే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నందున భూసేకరణ విషయమై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి ఎదురయ్యే సవాళ్లను అధిగమించాల్సి ఉంది.

అభివృద్ధిపై నేతల విమర్శలు

కంటోన్మెంట్ అభివృద్ధి పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నదంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అడపాదడపా విమర్శలు చేస్తున్నారు. బీజేపీకే చెందిన నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్ కంటోన్మెంట్ అభివృద్ధికి చేస్తున్నది శూన్యమంటూ తరచూ వ్యాఖ్యలు చేస్తున్నారు. మరోవైపు ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతో అభివృద్ధి జరుగుతున్నదే తప్ప కేంద్రం ఒక్కపైసా కూడా నిధులు కేటాయించలేదని ఎమ్మెల్యే శ్రీగణేశ్ వాదిస్తున్నారు. బీజేపీ-కాంగ్రెస్ పార్టీల వల్ల కంటోన్మెంట్‌కు ఒరిగిందేమీ లేదని, గతంలో కేసీఆర్ ప్రభుత్వం పుణ్యాన ఇంత అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ తమ వాదన వినిపిస్తున్నారు. తాజాగా ఎలివేటెడ్ కారిడార్ల భూముల పరిహారంగా 303 కోట్ల విడుదల విషయంలో కూడా ఈ మూడు పార్టీలు క్రెడిట్ కోసం పోటీపడ్డాయి. ఈ పార్టీల నాయకుల నుంచి కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ఉద్యోగులపై రాజకీయ ఒత్తిడి కూడా అధికమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త సీఈఓ వైఖరిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

పేరుకుపోయిన టీపీటీ బకాయిలు

ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీస్ (టీపీటీ) చార్జీలు గతంలో నేరుగా కంటోన్మెంట్ బోర్డు ఖాతాలో జమ అయ్యేవి. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో జమ చేసుకుని, తర్వాత కంటోన్మెంట్ బోర్డుకు విడుదల చేస్తోంది. తద్వారా టీపీటీ చార్జీల బకాయిలు పేరుకుపోతున్నాయి. మరోవైపు టీపీటీ చార్జీలపై రాష్ట్రం పెత్తనమేంటంటూ రాజకీయ వర్గాలు, పౌర సంఘాల నుంచి విమర్శలు వెలువడుతున్నాయి. దాంతో రావలసిన బకాయిల కోసం కొత్త సీఈఓ కూడా రాష్ట్ర ప్రభుత్వంతో ఎలా సంప్రదింపులు జరుపుతారో చూడాలి.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు

- 1, 10వ నంబర్ ప్లాట్‌ఫాంలపై వెయిటింగ్ హాళ్లు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం (సికింద్రాబాద్) డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి రైల్వే స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ప్లాట్‌ఫాం నంబర్ 1, 10లో వెయిటింగ్ హాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రయాణికులు పదో నంబర్ ప్లాట్‌ఫాం వైపు రావాలని గోపాలకృష్ణన్ సూచించారు. కార్యక్రమంలో సీపీఆర్‌వో శ్రీధర్, సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్, సీనియర్ డీసీఎం సిఫాలీ, సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


బాలనర్సమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న తలసాని

ఫొటోగ్రాఫర్ మాతృమూర్తికి నివాళి

పద్మారావునగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ తన వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌ను పరామర్శించారు. కొన్ని సంవత్సరాలుగా తన వద్ద ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న నర్సింగ్‌రావు మాతృమూర్తి బాలనర్సమ్మ(94) శుక్రవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో వారి నివాసానికి వెళ్లి బాలనర్సమ్మ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. నర్సింగ్‌రావు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట బన్సీలాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు సురేష్, మహేందర్ గౌడ్‌నేరేటి రవి, ముక్కా శ్రీనివాస్, హరిచారి, శివ తదితరులు ఉన్నారు.

ఓయూ లైబ్రరీలో 80వ ఐక్యరాజ్యసమితి దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి స్థాపనకు 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీలో శుక్రవారం "అంతర్జాతీయ హిమానీనదుల సంరక్షణ సంవత్సరం-2025" అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ప్రాంతీయ పట్టణ, పర్యావరణ అధ్యయన కేంద్రం(ఆర్‌సీయూఈఎస్) డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శ్రీనాగేశ్ మాట్లాడుతూ.. హిమానీనదులు కరగడం వల్ల సముద్ర మట్టం పెరుగుతుందని, తీర ప్రాంత నగరాలు మునిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్లోబల్ టెంపరేచర్ 1.5 డిగ్రీలలోపే ఉంచేందుకు పారిస్ ఒప్పందం లక్ష్యాలను కచ్చితంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు హిమానీనదులను కాపాడితే, రేపటి జీవితం రక్షించబడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ డా.ఎ.ఎస్.చక్రవర్తి, డా.ఎస్. యాదగిరి, డా.అచల మునిగల్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డి



సీఐటీయూ మండల స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న కోమటి రవి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయి

- సీఐటీయూ నేత కోమటిరవి

మల్కాజిగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని సీఐటీయూ నేత కోమటి రవి అన్నారు. శుక్రవారం సీఐటీయూ మల్కాజిగిరి మండలస్థాయి సమావేశం నేరేడ్‌మెట్‌లోని డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో సీపీఎం కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కోమటి రవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా భావిస్తూ 8 గంటల చేయాల్సిన పనిని 10, 12 గంటలకు పెంచి బానిసలుగా చేస్తున్నాయని అన్నారు. సీఐటీయూ నాయకులు కృపాసాగర్ మాట్లాడుతూ గతంలో సీఐటీయూ అనేక రంగాల్లో విస్తరించి పనిచేస్తూ వస్తుందన్నారు. మున్సిపల్, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, స్నేహ ఇంటిపనివారలు, భవన నిర్మాణ, స్టోన్‌లేయింగ్, ఆటోట్రాలీ, పేయింటర్ ఇలా అన్ని రంగాల్లో కూలీ రేట్లు జీతాల పెంపు కోసం అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు.


విదేశీ విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చీకటిపై వెలుగు విజయం దీపావళి సందేశం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయోధ్య నుంచి అడిస్ అబాబా వరకు, హైదరాబాద్ నుంచి హనోయ్ వరకు దీపావళి పండుగ "చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయం" అనే సందేశాన్ని అందిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఆయన విదేశీ విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి కాలపు సహకారం, ఏకతా స్ఫూర్తి ద్వారా అసాధ్యాన్ని సాధ్యంగా మార్చిన ఉదాహరణలను వివరించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అసమానత్వం, ఆకలి, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై యువత కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. యువత ఆధునిక సాంకేతికతలో విశ్వవ్యాప్తంగా విజయాలు సాధిస్తున్నారని, హైదరాబాద్ డిఫెన్స్ ఏరోస్పేస్, ఐటీ, లైఫ్ సైన్సెస్‌లో గ్లోబల్ హబ్‌గా మారిందని పేర్కొన్నారు. మహానిర్మాణం, సాంకేతికత, సామాజిక విలువలతో భారత్ 2047 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనున్నదని వ్యాఖ్యానించారు.


పర్యావరణ పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరించిన నెహ్రూనగర్ పార్కు డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

మారేడుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హనుమంత్ యాదవ్ సూచించారు. శుక్రవారం వెస్ట్‌మారేడుపల్లి నెహ్రూనగర్ పార్కులో పార్కు డెవలప్‌మెంట్ కమిటీ, వాకర్స్ అసోసియేషన్, రెసిడెన్షియల్ కాలనీ వాసులతో కలిసి పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన అంశాలను, నమూనాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. పోస్టర్లను పార్కు ఆవరణలో చుట్టూ పరిసర ప్రాంతాల్లో అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్వైజర్ ఎస్‌పి రెడ్డి, కార్యదర్శి మహేందర్, కోశాధికారి ప్రమోద్ కుమార్, కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

27న పోలీసుల మెగా రక్తదాన శిబిరం

బౌద్ధనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా చిలకలగూడ, ఓయూ ఏసీపీ డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో 27వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ, అడిక్‌మెట్ ఫ్లైఓవర్ సమీపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఈస్ట్ జోన్ చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు. 27వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏసీపీలు శశాంక్‌రెడ్డి, జగన్, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, రఘుబాబు, ఎం.అప్పలనాయుడు, మారుతీప్రసాద్ సమక్షంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

ఓయూలో కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రమోషన్లలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు గత కొంత కాలంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ మెనేజ్మెంట్ కాలేజీ వద్ద భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో ఎన్నడూ లేని విధంగా 48 మంది అధ్యాపకులను రిజెక్టు చేయడాన్ని ఔటా తీవ్రంగా ఖండించింది. బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలు, ఉత్తమ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులకు సైతం ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చేలా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఓయూ అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్, ప్రొఫెసర్లు వెంకటదాస్ సుజాత, రాంచందర్, గంగాధర్, అపర్ణ, మాధురి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సీఎం ప్రజావాణి చొరవతో 1,087 మందికి 'డబుల్' ఇళ్లు

బేగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి చొరవతో 1087 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారులు శుక్రవారం సీఎం ప్రజావాణికి వచ్చి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ప్రజావాణికి 220 దరఖాస్తులు వచ్చాయన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 64, రెవెన్యూకు 54, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46, హోంశాఖకు 14, ప్రవాసి ప్రజావాణికి 2, ఇతర శాఖలకు 49 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి అధికారి పేర్కొన్నారు.


సీఎం ప్రజావాణిలో చిన్నారెడ్డి, దివ్యను కలిసిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి

ముషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న లక్ష మందితో నిర్వహించే చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కోరారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో దళితుల ఆత్మగౌరవ సభ విజయవంతానికై నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి గజ్జల రాజశేఖర్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన పోలీసులు కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గవాయి దళితుడు అయినందు వల్లే ఆయనపై దాడి చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆయనపై జరిగిన దాడి వల్ల దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గవాయిపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ వినయ్, నాయకులు శ్రీకాంత్, రోషన్, దశరత్, మధు, రమేష్, రాములు, వెంకటయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గజ్జల రాజశేఖర్ మాదిగ

కార్తీకమాసం..

కార్తీకమాసం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో శుక్రవారం స్వామివారికి పూలతో అలంకరణ చేసిన ఆలయ పూజారులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి

